

రైల్వేస్టేషన్లకు ఆధునిక హంగులు

రైల్వే స్టేషన్లకు ఆధునిక హంగులు కల్పిస్తున్నట్టు ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ తెలిపారు. – 8లో

మల్లన్న తలపాగా ఊరేగింపు



రాజాం సిటీ: మహాశివరాత్రి పర్వదినాన శ్రీశైలంలోని మల్లికార్జున స్వామికి సమర్పించేందుకు నేసిన తలపాగాను రాజాం పట్టణంలో చేనేత సొసైటీ సంఘ సభ్యులు సోమవారం ఊరేగింపు చేపట్టారు. ముందుగా తలపాగాకు ప్రత్యేక పూజలు చేశారు.

టారిఫ్ బోర్డులు తప్పనిసరి

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఉన్న ప్రతీ ప్రైవేట్ ఆస్పత్రి, క్లినిక్, డయాగ్నోస్టిక్ సెంటర్, ఫిజియోథెరపీ క్లినిక్ వద్ద తప్పనిసరిగా ప్రజలకు కనిపించేలా టారిఫ్‌బోర్డులు పెట్టాలని , లేదంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవన రాణి సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. రిజిస్ట్రేషన్, రెన్యూవల్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

బధిరులు, అంధుల పాఠశాల పరిశీలన



బధిరుల స్కూల్‌లో సమస్యలను విద్యార్థిని అడిగి తెలుసుకుంటున్న జిల్లా జడ్జి సాయికళ్యాణ్ చక్రవర్తి

విజయనగరం లీగల్: రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టి.వి.రాజేష్ కుమార్‌తో కలిసి ప్రభుత్వ బధిరులు, అంధుల రెసిడెన్షియల్ స్కూళ్లను సోమవారం పరిశీలించారు. వసతిగృహం గదులను తనిఖీ చేశారు. మెనూ అమలుపై ఆరా తీశారు. మరుగుదొడ్లను పరిశీలించి వాటిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో కూర్మానందరావు, విజయనగరం తహసీల్దార్ పి.సత్యవతి, ఎంఈఓ, బధిరుల, అంధుల పాఠశాల ప్రిన్సిపాల్స్ జె.దయానంద, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాలెట్ పత్రాల పరిశీలన



బ్యాలెట్ పత్రాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి కలెక్టరేట్‌కు చేరుకున్న బ్యాలెట్ పత్రాలను కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ సోమవారం పరిశీలించారు. తనిఖీ ప్రక్రియ నిర్వహణకు చేసిన ఏర్పాట్లను డీఆర్‌ఓ ఎస్. శ్రీనివాసమూర్తి కలెక్టర్‌కు వివరించారు. ఆయన వెంట ఎన్నికల సూపరింటెండెంట్ భాస్కరరావు పాల్గొన్నారు.

విలేకరిపై దాడి తగదు

- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



విజయనగరం: పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ ప్రజాశక్తి విలేకరిపై టీడీపీ నాయకుడి దాడిని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో ఖండించారు. ప్రజాస్వామ్య మనుగడకు మూలాధారమైన పత్రికా వ్యవస్థపై దాడి సమంజసంకాదన్నారు. వ్యతిరేక వార్తలు రాసి నప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా వివరణ ఇవ్వాలని, లేదంటే ప్రకటన ద్వారా ఖండించాలే తప్ప భౌతికదాడులు సరైన మార్గం కాదన్నారు. బాధిత పాత్రికేయులకు అన్ని విధాల అండగా నిలుస్తామని ఆయన ప్రకటించారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

బొండపల్లి: పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక తర్ఫీదునివ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యంనాయుడు సూచించారు. మండలంలోని నెలివాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సోమవారం సాయంత్రం పరిశీలించారు. పరీక్షల సన్నద్ధతపై విద్యార్థులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాద స్థలాల గుర్తింపు



బ్లాక్ స్పాట్‌లను గుర్తిస్తున్న ఎస్పీ వకులజిందల్, ఎన్‌హెచ్‌ఏ, ఆర్టీఏ అధికారులు

విజయనగరం క్రైమ్: జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ మండలాల పరిధిలో జాతీయ రహదారి–16పై తరచూ ప్రమాదం జరిగే ప్రదేశాలను ఎస్పీ వకుల్ జిందల్ సోమవారం పరిశీలించారు. విజయనగరం డీఎస్పీ శ్రీనివాస్, భోగాపురం సీఐ రామకృష్ణ, ఎస్‌ఐలతో కలిసి సవరవిల్లి, పోలిపల్లి, లింగాలవలస, నారుపేట, భూమాత లేఅవుట్, ఉప్పాడపేట, నందిగాం, భోగాపురం, సుందరపేట ఇలా 18 కిలోమీటర్ల విస్తీర్ణంలో యాక్సిడెంట్ (బ్లాక్) స్పాట్‌లను డ్రోన్ల సహాయంతో గుర్తించారు. ఆర్టీఏ బ్రేక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు, ఎన్‌హెచ్‌ఏ అధికారి మొనాడ్‌లాల్‌తో ప్రమాద కారణాలపై చర్చించారు. ఈ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు పెట్టాలని, గస్తీ పెంచాలని పోలీసులను ఆదేశించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో జీబ్రా లైన్లతో పాటు జిగ్‌జాగ్‌లను పెట్టాలన్నారు.

అధికార దర్పం తగదు



ఉపాధిహామీ పనుల్లో కూటమి నాయకులు అధికార దర్పాన్ని ప్రదర్శించడం తగదు. స్థానికంగా పనికల్పించి వలసలను నివారించాలన్న లక్ష్యంతో చేపట్టే ఉపాధిహామీ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించడం నిబంధనలకు విరుద్ధం. హైకోర్టు సైతం తప్పుబట్టింది. ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధుల తీర్మానానికి, మాటకు విలువలేకుండా పంచాయతీల్లో అడ్డగోలుగా పనులు చేపడితే ఊరుకునేది లేదు. న్యాయం జరిగే వరకు పోరాటం ఆపే ప్రసక్తే లేదు.

– పతివాడ అప్పలనాయుడు, ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, పూసపాటిరేగ

వెండర్ విధానాన్ని రద్దు చేయాలి



ఉపాధహామీ పనుల్లో వెండర్ విధానాన్ని రద్దు చేయాలి. ఏ ప్రభుత్వం ఉన్నా సర్పంచ్‌ల హక్కులకు భంగం కలగకుండా పనులు చేపట్టేవారు. సర్పంచ్‌ల తీర్మానాలు లేకుండానే అధికార పార్టీ నాయకులు వారికి నచ్చిన వారికి పనులు అప్పగించి ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారు. సర్పంచ్‌ల ఆధ్వర్యంలో, వారి తీర్మానాలతో పనులు చేపట్టాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును అమలు చేయాలి. లేదంటే వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆందోళన ఉద్ధృతం చేస్తాం.

– చల్ల చెల్లంనాయుడు, ఎంపీపీ, బొండపల్లి

సర్పంచ్‌ల హక్కులకు.. ▸ కూటమి తూట్లు



- పల్లెల్లో కూటమి ప్రభుత్వ ప్రత్యేక చట్టం అమలు
- వెండర్ విధానంలో ఉపాధిహామీ పనులు
- సర్పంచ్‌ల తీర్మానానికి చెల్లు
- హైకోర్టు తీర్పు ఉన్నా బేఖాతరు
- ఆవేదన వ్యక్తం చేసిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు
- కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌కు ఫిర్యాదు



ఉపాధిహామీ పనుల్లో వెండర్ (కాంట్రాక్టు) విధానం రద్దుచేయాలంటూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల కాపీని చూపిస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు

విజయనగరం ఫోర్ట్:

ఉపాధిహామీ చట్టానికి టీడీపీ కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని, సర్పంచ్‌ల హక్కులు, అధికారాలను కాలరాస్తూ ఉపాధిహామీ పనులను వెండర్ విధానంలో కాంట్రాక్టర్లకు కట్టబెట్టడంపై స్థానిక ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. హైకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను వ్యతిరేకించారు. కలెక్టరేట్‌కు సోమవారం చేరుకుని ప్రభుత్వ తీరును మీడియా సాక్షిగా ఎండగట్టారు. ఉపాధిహామీ పనుల్లో వెండర్ విధానం వద్దంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పుకాపీలను చూపించారు. న్యాయస్థానం ఉత్తర్వులు అమలుచేయాలంటూ కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు.

● పంచాయతీ తీర్మానాలను పక్కనపెట్టి...

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం–2005 ప్రకారం ఉపాధిహామీ పనుల్లో 50 శాతం కూలీలకు కచ్చితంగా పనికల్పించాలి. యంత్రాలతో పనులు చేయించకూడదు. ప్రైవేటు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించకూడదు. గ్రామ సభ అమోదించిన పనులను మాత్రమే చేయాలి. కూటమి ప్రభుత్వం ఇవేవీ పట్టించుకోవడం లేదు. పంచాయతీ తీర్మానాలకు విరుద్ధంగా వెండర్ విధానంలో పనులు కట్టబెడుతోంది. కూటమి కార్యకర్తలు, నాయకులకు ఉపాధి నిధులను దోచిపెడుతోంది. ఈ విధానం తక్షణమే రద్దు చేయాలని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం మెటీరియల్ వర్క్స్‌లో కాంట్రాక్టు విధానాన్ని కూటమి నేతల లబ్ధికోసమే అమలుచేస్తోందని ఆరోపించారు.

● 2,199 పనులు మంజూరు

జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద మెటీరియల్ వర్క్స్ 2,199 మంజూరయ్యాయి. ఈ పనులు ప్రస్తుతం వెండర్ విధానంలో జరుగుతున్నాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తారు రోడ్లు, మెటల్ రోడ్లు వంటి పనులకు రూ.152 కోట్లు, ప్రహరీ నిర్మాణాలకు రూ.12 కోట్లు వెచ్చించనున్నారు. వెండర్‌విధానాన్ని రద్దుచేయాలంటూ పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఉపాధిహామీ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించరాదని తీర్పు ఇచ్చింది. దీనిని అమలుచేయాలంటూ వైఎస్సార్‌సీపీ పంచాయితీరాజ్ విభాగం ప్రతినిధులు మామిడి అప్పలనాయుడు, పీరుబండి జైహింద్‌కుమార్, వర్రి నరసింహమూర్తి, అంబళ్ల శ్రీరాములునాయుడు తదితరులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.



హైకోర్టు ఉత్తర్వులు అమలుచేయాలంటూ కలెక్టర్ అంబేడ్కర్‌కు వినతి పత్రం అందజేస్తున్న స్థానిక సంస్థల ప్రతినిధులు

స్థానిక సంస్థలు ఖూనీ



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణా ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోంది. పంచాయతీల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులను తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు కట్టబెట్టేలా వెండర్స్ విధానాన్ని తీసుకువచ్చి వారితోనే పనులను చేయించడం దుర్మార్గం. న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం అపహాస్యం చేస్తోంది.

– కునుకు వెంకటరావు, సర్పంచ్, గుంకలాం గ్రామం, విజయనగరం మండలం

చట్ట విరుద్ధం



కూటమి ప్రభుత్వం చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తోంది. ఉపాధిహామీ పనుల్లో వెండర్ (కాంట్రాక్ట) విధానాన్ని రద్దు చేయాలి. సర్పంచ్‌ల తీర్మానం ప్రకారం మెటీరియల్ పనులు చేపట్టాలి. ఉపాధిహామీ చట్టం లక్ష్యాన్ని నెరవేర్చాలి.

– లెంక రత్నాకర్ నాయుడు, మెంటాడ

సర్పంచ్‌ల హక్కులను కాలరాయొద్దు



కూటమి ప్రభుత్వం సర్పంచ్‌ల హక్కులను కాలరాసేలా వ్యవహరిస్తోంది. పంచాయతీ తీర్మానం, స్థానిక ప్రజాప్రతినిధులతో సంబంధం లేకుండా పనులు చేయడం సమంజసం కాదు. కాంట్రాక్ట్ (వెండర్) విధానాన్ని రద్దు చేయాలి. కాంట్రాక్టర్లకు పనులు అప్పగించవద్దని హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలి. అమలు చేయకపోతే మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం.

– గార తవుడు, జెడ్పీటీసీ సభ్యుడు, గజపతినగరం

నిధులు దుర్వినియోగం



ఉపాధిహామీ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఉండేది. గ్రామ సభల ఆమోదంతో పనులను గుర్తించి, అభివృద్ధి పనులు చేపట్టేవారం. ప్రస్తుతం కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలకు లబ్ధి చేకూర్చేలా వెండర్స్ విధానాన్ని తీసుకువచ్చి పంచాయతీల ఆమోదం లేకుండా పనులు చేపడుతుండడం విచారకరం. ఇది ఉపాధిచట్టానికి విరుద్ధం.

– ఎం.రమ్య, సర్పంచ్, కొండకరకాం, విజయనగరం మండలం

ఇష్టారాజ్యమంటే కుదరదు



మేమంతా ప్రజలతో ఎన్నుకోబడిన ప్రతినిధులం. పంచాయతీ పరిధిలో ఏ పనులు చేస్తే రైతులు, ప్రజలు, పంచాయతీకి ఉపయోగకరంగా ఉంటాయో మాకు తెలుస్తాయి. ఆ మేరకు పనులకు తీర్మానాలు చేస్తాం. వీటిని పక్కనపెట్టి, మా హక్కులు కాలరాసేలా ఉపాధిహామీ పనులను కాంట్రాక్టర్లతో చేపట్టడం నిబంధనలకు విరుద్ధం. హైకోర్టు కూడా ఇదే చెప్పింది. చట్టాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

– అలమండ వాణి. సర్పంచ్, బుడతానాపల్లి



● ఎండన బడిన పిల్లలు

రథసప్తమి వెళ్లాక.. ఎండలు మండుతున్నాయి.. రెండు నిమిషాలు బయట ఉంటేనే.. నెత్తిన అగ్నిగోళం పెట్టుకుని తిరుగుతున్నట్లు అనిపిస్తోంది. కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. పెద్దవారే ఎండల ధాటికి బెంబేలెత్తిపోతున్నారు. అలాంటిది చిన్న పిల్లలు.. విద్యార్థులు.. ఏకధాటిగా కూర్చొన్న చోట నిలువ నీడ లేక.. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పందిర నీడన ఒకేచోట ఉండాలంటే సాధ్యమేనా? రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సొంత నియోజకవర్గం సాలూరులోనే విద్యార్థులకు ఈ దుస్థితి ఎదురుకావడం గమనార్హం.

సాలూరు మండలం తోనాం పంచాయతీ మెట్టవలస గ్రామంలో గతంలో ఆర్సీఎం పాఠశాల ఉండేది. అది ఒక పాత భవనంలో నడిచేది. రెండేళ్ల కిందట అది కూలిపోవడంతో దానిని ఎంపీపీ స్కూల్‌గా మార్చారు. తర్వాత కొన్నాళ్లపాటు తాత్కాలికంగా జీసీసీ భవనంలో పాఠశాలను నడిపించారు. అనంతరం ఆ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావడంతో అక్కడ ఖాళీ చేయించారు. ప్రస్తుతం పిల్లలకు పాఠాలు ఒక చెట్టు కింద, పందిరిలో బోధించాల్సిన పరిస్థితి నెలకొంది. పిల్లలకు సరైన సదుపాయాలు లేక ఎండలో ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల గురించి ప్రస్తుత గిరిజన శాఖ మంత్రికి విన్నవించినా స్పందన శూన్యం. ప్రస్తుతం ఊరిలో 52 మందికి పైగా పిల్లలు ఊరి చివరన గ్రామస్తులు, ఉపాధ్యాయులు కలిసి ఏర్పాటుచేసిన పందిరి నీడలోనే చదువుకుంటున్నారు. ఇంకొందరు ఇతర పాఠశాలలకు వెళ్తున్నారు. అసలే ఎండలు. ఆపై ఆరుబయట చదువులతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కనీసం ఒక షెల్టర్ అయినా ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు. పిల్లల చదువు కష్టాలకు ఈ చిత్రాలే సాక్ష్యం.

– సాక్షి, పార్వతీపురం మన్యం



● రోగుల తాకిడి

గజపతినగరం ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి పెరిగింది. రోజుకు సగటున 250 నుంచి 300 ఓపీ నమోదవుతోంది. ఓ వైపు మంచు.. మరోవైపు ఎండల ప్రభావంతో గొంతు, జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలతో అధికమంది ఆస్పత్రిలో వైద్యసేవలు పొందేందుకు వస్తున్నారు. ఉదయం 10 గంటలకే ఆస్పత్రి ఓపీ విభాగం వద్ద బారులు తీరుతున్నారు. దీనికి ఆస్పత్రిలో సోమవారం కనిపించిన ఈ చిత్రమే సజీవసాక్ష్యం. ఎండల్లో తిరగవద్దని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

– గజపతినగరం

● మా గోడు వినండి సారూ..



చిత్రంలో లక్కవరపుకోట వెలుగు కార్యాలయం వద్ద హైకోర్టు ఉత్తర్వుల కాపీలను చూపిస్తున్నది లక్కవరపుకోట మండలం కొట్యాడ, తలారి గ్రామాలకు చెందిన మద్ది శ్యామల, తలారి బంగారమ్మ. ఇందిరా క్రాంతి పథంలో భాగంగా విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (వీఓఏ)లుగా సుమారు 12 సంవత్సరాలుగా నెలకు రూ.3 వేల జీతం నుంచి పనిచేస్తున్నారు. ఇప్పుడు రూ.10వేలకు జీతం పెరగానే వీరిని గతేడాది జూన్ 27న అకారణంగా విధులనుంచి తొలగించారు. వీరి స్థానంలో కూటమి కార్యకర్తలను చేర్చుకున్నారు. జరిగిన అన్యాయంపై వీరు హైకోర్టును ఆశ్రయించారు. తక్షణమే విధుల్లోకి చేర్చుకోవాలంటూ హైకోర్టు గతేడాది సెప్టెంబర్ 18వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వుల కాపీలను కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ, వెలుగు ఏపీడీ, ఏపీఎం తదితర అధికారులకు రిజిస్టర్ పోస్టుచేశారు. కొందరిని స్వయంగా కలిసి గోడువినిపించారు. అయినా ఏ ఒక్క అధికారి స్పందించలేదు. విధుల్లోకి చేర్చుకోలేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతస్థాయి అధికారులు స్పందించి రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం జారీ చేసిన ఉత్తర్వులను అమలుచేయాలని, ఉద్యోగాలిప్పించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

– లక్కవరపుకోట

వెన్నశాతం పెంపుతో రైతులకు నష్టం

విజయనగరం ఫోర్ట్: ఆవు పాలు వెన్నశాతాన్ని 2.8 నుంచి 3.1 శాతానికి విశాఖ డెయిరీ యాజమాన్యం పెంచిందని, దీనివల్ల పాల రైతులు నష్టపోతారని, దీనిని 2.8 శాతంగానే ఉంచాలని ఏపీ పాలరైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుద్దరాజు రాంబాబు డిమాండ్ చేశారు. స్థానిక రైతు సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 లీటర్ల కంటే తక్కువ పాలు సేకరిస్తున్న కేంద్రాల నిలుపుదల నిర్ణయాన్ని వెనుకకు తీసుకోవాలన్నారు. విశాఖ డెయిరీపై వేసిన హౌస్ కమిటీ విచారణను వేగవంతం చేయాలన్నారు. డెయిరీని సహకారం రంగంలోకి తీసుకురావాలన్నారు. దాణాను 50 శాతం రాయితీపై ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రోత్సాహకంగా లీటర్‌కు రూ.5 ఇవ్వాలన్నారు. సమావేశంలో సంఘ నాయకులు ఆదినారాయణ, కృష్ణమూర్తి, ఎస్.గోపాలం, పైడిపునాయుడు, గంగునాయుడు, సత్యనారాయణ, చుక్క అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఆదాయం పెంచే సూచనలివ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న ముకుందరావు

విజయనగరం ఫోర్ట్: రైతులకు ఆదాయం పెంచేలా సూచనలు, సలహాలు అందించాలని ఆచార్య ఎన్.జి.రంగా సహాయ విస్తరణ సంచాలకులు బి.ముకుందరావు సూచించారు. గాజులరేగ వ్యవసాయ పరిశోధన స్థానంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరకు సాగు విస్తీర్ణం పెంచి బెల్లం తయారీకి రైతులను ప్రోత్సహించాలన్నారు. మొక్కజొన్నలో కాండం తొలుచుపురుగు ఉధృతి పెరుగుతోందని, నివారణ చర్యలను రైతులకు వివరించాలన్నారు. అధిక దిగుబడినిచ్చే కొత్త వంగడాలను అందించాలని సూచించారు. రెల్లరాల్చు పురుగు వల్ల రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగువిధానాలు తెలియజేయాలన్నారు. సమావేశంలో అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు సీహెచ్ ముకుందరావు, జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు, పశు సంవర్ధక శాఖ జేడీ వై.వి.రమణ, ఉద్యానశాఖ డీడీ జమదగ్ని, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ కెల్ల లక్ష్మణ్, ఎం.వి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు రెట్టింపు పరిహారం



పాటూరులో నిర్వాసితులతో మాట్లాతున్న ఆర్డీఓ కీర్తి

వేపాడ: పెందుర్తి– బౌడారా– 516బి రోడ్డు విస్తరణలో భూములు, గృహాలు కోల్పోతున్న నిర్వాసితులకు రెట్టింపు పరిహారం అందజేస్తున్నట్టు ఆర్డీఓ దాట్ల కీర్తి తెలిపారు. తహసీల్దార్ రాములమ్మ నేతృత్వంలో బొద్దాం, పాటూరులో నిర్వాసితులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నిర్వాసితుల జాబితాలో పేర్లు లేనివారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2013 భూసేకరణ చట్టం నిబంధనల మేరకు నిర్వాసితులకు పరిహారం అందజేస్తున్నట్టు వెల్లడించారు. వ్యవసాయ భూములకు సెంటుకు రూ.26,500, వ్యవసాయేతర స్థలాలకు గజానికి రూ.6వేలు చొప్పున పరిహారం అందజేస్తామన్నారు. బొద్దాంలో 130, పాటూరులో 30 మంది నిర్వాసితులను గుర్తించామని చెప్పారు. కార్యక్రమంలో ఉపతహసీల్దార్ సన్యాసినాయుడు, ఆర్ఐ రామలక్ష్మి, మండల సర్వేయర్, వీఆర్వో, గ్రామ పెద్దలు కొట్యాడ రమణమూర్తి, ద్వారపూడి గంగునాయుడు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు రూ.26వేలు వేతనం చెల్లించాలి

- అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ



మాట్లాడుతున్న అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావమ్మ



హాజరైన అంగన్‌వాడీ సిబ్బంది

విజయనగరం గంటస్తంభం: అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. విజయనగరం పట్టణంలోని ఎన్‌పీకే ఆర్ శ్రామిక్ భవన్‌లో స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యదర్శి విశాలాక్షి అధ్యక్షతన సోమవారం సాయంత్రం నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు గతం కంటే అదనంగా కేటాయించిన రూ.150 కోట్లను లెక్కకడితే పిల్లాడికి 5 పైసలు వస్తుందన్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు ఆ నిధులు సరిపోవన్నారు. విద్య, వైద్య రంగాలకు, ఉపాధి హామీ పథకానికి అరకొరగా నిధులు కేటాయించి గొప్పగా చెప్పుకోవడాన్ని ఆమె తప్పుబట్టారు. కేంద్రంలో బీజేపీ నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక వర్గాన్ని కార్పొరేట్లకు తాకట్టుపెట్టిందని, అందులో భాగమే 4 లేబర్ కోడ్లు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తెస్తున్నారని మండిపడ్డారు. కోటి మందికి పైగా ఉన్న స్కీమ్ వర్కర్స్‌ను కార్మికులుగా గుర్తించడానికి మోదీ అంగీకరించడం లేదని, 8 గంటల పనిదినాన్ని 12 గంటలుగా మార్పు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న మొత్తం మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లగా మార్పు చేస్తూ జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్వీస్‌లో ఉంటూ చనిపోయిన వారికి మట్టి ఖర్చుల కింద రూ. 20వేలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఫిబ్రవరి 28న రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు తగినంత కేటాయింపులు చేయాలని, అంగన్‌వాడీల వేతనాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహనరావు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పైడిరాజు, మంగవేణి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జీబీఎస్‌పై అప్రమత్తం

• కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: గులియబుల్ భారే సింగ్రోమ్ (జీబీఎస్)పై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. జీబీఎస్‌పై వైద్యశాఖ, పంచాయతీరాజ్‌శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు జీబీఎస్‌పై అవగాహన కల్పించాలని కోరారు. పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను వివరించడంతో పాటు వేడినీరు తాగడం, వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని తెలియజేయాలన్నారు. సమావేశంలో కేఆర్ఆర్ఎస్‌డీసీ పి.ధర్మచంద్రారెడ్డి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌తో ఎంఆర్ కళాశాల ఎంఓయూ



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న వర్సిటీ, కళాశాల ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయం విజయనగరం మహారాజా కళాశాలతో సోమవారం ఎంఓయూ కుదుర్చుకుంది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాంబశివరావు, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ..నూతన జాతీయ విద్యావిధానం ప్రకారం ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధన, నైపుణ్యం, తదితర అవకాశాలకు ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో డీన్లు డాక్టర్ సన్నీడయోల్, డాక్టర్ విజయ్‌బాబు, పుష్పలత, ఐక్యూసీ హెడ్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల సత్తా



విజేతలైన క్రీడాకారులతో ప్రజాప్రతినిధులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. ఈ నెల 11,12 తేదీల్లో విశాఖపట్నంలోని జరిగిన డీఆర్ఎం కప్ 8వ రాష్ట్రస్థాయి ఉమెన్స్ సీనియర్ బాక్సింగ్ చాంపియన్ షిప్ 2025లో విజయనగరం క్రీడాకారులు మూడు రజత పతకాలు, మూడు కాంస్య పతకాలు గెలుపొందారు. విజేతల్లో ఎస్. షర్మిల 70 కిలోల రజత పతకం, మనోజి 75 కిలోల విభాగంలో రజత పతకం, సుమిత్ర 80 కిలోల కేటగిరిలో రజత పతకం, ఎన్.రమ్య 57 కిలోల కేటగిరిలో కాంస్య పతకం, బి.పూజిత 65 కిలో కేటగిరిలో కాంస్య పతకం, 60 కిలోల విభాగంలో వై.అనుష కాంస్య పతకం దక్కించుకున్నారు. విజేతలను స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతి రాజు అభినందించారు.

100 లీటర్ల సారా స్వాధీనం

• ఇద్దరిపై కేసు నమోదు



స్వాధీనం చేసుకున్న సారాను చూపుతున్న కురుపాం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తదితరులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఇరిడి, పులిగూడ గ్రామాల్లో సారా అమ్మకాలపై సోమవారం నిర్వహించిన దాడుల్లో భాగంగా సారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు సారాను కలిగి ఉన్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఇరిడి గ్రామంలో బిడ్డిక గుండు 80 లీటర్ల సారాతో, పులిగూడ గ్రామానికి చెందిన ఊయక కిరణ్ కుమార్ 20 లీటర్ల సారాతో పట్టుబడ్డారని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కురుపాం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల మండలాల్లో సారా తయారీ, విక్రయాలు, సరఫరా అరికట్టేందుకు దాడులు ముమ్మరంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹110	₹190	200

ఉచిత విద్యుత్ పథకానికి మంగళం

• ఒక్క ఉచిత విద్యుత్ కనెక్షన్ కూడా ఇవ్వని ప్రభుత్వం
• ఉచిత విద్యుత్‌కు తూట్లు పొడుస్తున్న కూటమి



పంప్‌సెట్



వీరఘట్టం విద్యుత్ సబ్‌స్టేషన్

వీరఘట్టం:

- పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం కడకెల్ల గ్రామానికి చెందిన ద్వారపురెడ్డి రామకృష్ణ అనే రైతు ఉచిత వ్యవసాయ విద్యుత్ మీటర్ కోసం 8 నెలల క్రితం దరఖాస్తు చేశాడు. ఇంతవరకు ఆయన దరఖాస్తును పరిశీలించిన దాఖలాలు లేవు.
- అలాగే వీరఘట్టం గ్రామానికి చెందిన మంచుపల్లి గోపాలం అనే మరో రైతు ఉచిత వ్యవసాయ విద్యుత్ మీటర్ కోసం తన దరఖాస్తును ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఆ రైతుకు కూడా ఇంతవరకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. ఇలా వీరఘట్టం మండలంలో 15 మంది రైతులు ఉచిత వ్యవసాయ విద్యుత్ మీటరు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, మరో 30 మంది వీరఘట్టం ట్రాన్స్‌కో కార్యాలయంలో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. ఇలా వీరఘట్టం మండలంలో ఇంతవరకు 45 మంది వరకు రైతులు ఉచిత విద్యుత్ వ్యవసాయ మీటర్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంతవరకు ఒక్క ఉచిత విద్యుత్ వ్యవసాయ కనెక్షన్ కూడా ఇవ్వకపోవడం గమనార్హం.
- ఉచిత విద్యుత్ పథకానికి చంద్రబాబు ప్రభుత్వం దశల వారీగా మంగళం పాడుతోంది. రైతులకు ఆపన్న హస్తంగా మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఈ విప్లవాత్మక పథకానికి టీడీపీ కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది.అందుకోసం పక్కా పన్నాగంతో వ్యవహరిస్తోంది. కొత్తగా వ్యవసాయ కనెక్షన్లు ఇస్తే ఉచిత విద్యుత్ ఇవ్వాల్సి వస్తుంది. కాబట్టి ఏకంగా కొత్త విద్యుత్ కనెక్షన్ల మంజూరునే ప్రభుత్వం నిలిపి వేసింది. గతేడాది 2024 ఆగస్టు తర్వాత రాష్ట్రంలో కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఒక్కటి కూడా కూడా మంజూరు చేయలేదు. ఆగస్టు నెలాఖరు వరకు మంజూరు చేసిన కనెక్షన్లు కూడా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆమోదించిన వాటికే కనెక్షన్లు ఇచ్చారు.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఎనిమిది నెలల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయలేదు.

రాష్ట్రంలో 1.50 లక్షల దరఖాస్తుల పెండింగ్..

పార్వతీపురం జిల్లాలో కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నప్పటికీ వాటికి ప్రభుత్వం ఆమోదం తెలపడం లేదు. పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో ఇప్పటికీ 2,500లకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.వాటిని పరిష్కరించి కొత్త విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలన్న ఆలోచన ప్రభుత్వానికి ఏ మాత్రం లేదు. కనీసం ఆ దరఖాస్తులను ఇంతవరకు పరిశీలించకపోవడం కానీ, స్క్రూటినీ చేయకపోవడం కానీ ఇందుకు నిదర్శనం. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు 2,500మందికి పైగా రైతులు ఉచిత విద్యుత్ పథకాన్ని కోల్పోతున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో రైతులకు కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకం అందనీయకుండా తీరని అన్యాయం చేస్తోంది. రాష్ట్రంలో ఉచిత విద్యుత్ కోసం సుమారు 1.50 లక్షల మంది రైతుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

ఏడు నెలలవుతోంది



ఏడు నెలల క్రితం వీరఘట్టం విద్యుత్ శాఖ కార్యాలయంలో ఉచిత విద్యుత్ మీటరు కోసం దరఖాస్తు చేశాను. ఇంత వరకు ఆ దరఖాస్తు ఏమైందో తెలియదు. ఉచిత విద్యుత్ కనెక్షన్ ఎప్పుడు ఇస్తారని లైన్‌మెన్‌ను అడిగితే ఎవరూ సమాధానం చెప్పడం లేదు. ఉచిత విద్యుత్ కనెక్షన్ ఎప్పుడు ఇస్తారో చెప్పాలి.

– లెంక జగదీశ్వరరావు, రైతు, నడుకూరు గ్రామం, వీరఘట్టం మండలం, పార్వతీపురం మన్యం జిల్లా

ప్రాధాన్యతా క్రమంలో మంజూరు

ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు గతేడాది ఆగస్టు నెలాఖరు వరకు పూర్తి చేశా. మిగిలిన దరఖాస్తులకు ప్రాధాన్యతా క్రమంలో కనెక్షన్ ఇస్తాం. కనెక్షన్ కావాల్సిన వారు 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే మా సిబ్బంది పరిశీలించి విద్యుత్ కనెక్షన్ ఇస్తారు.

– ఎస్.చలపతిరావు, ట్రాన్స్‌కో ఎస్ఈ, పార్వతీపురం మన్యం జిల్లా

స్త్రీ, పురుష నిష్పత్తిని తగ్గించాలి

• కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో స్త్రీ, పురుష నిష్పత్తిలో వ్యత్యాసం అధికంగా ఉంటున్నదని, దీనిని తగ్గించేందుకు గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి స్కానింగ్ కేంద్రాలపై గట్టి నిఘా ఉంచాల్సిన అవసరం ఉందని కలెక్టర్ బీఆర్. అంబేడ్కర్ అన్నారు. జిల్లాలో ఉన్న 110 స్కానింగ్ కేంద్రాల ద్వారా రోజువారీ జరుగుతున్న స్కానింగ్‌ల సమాచారాన్ని సేకరించాలని సూచించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం వైద్యాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. గర్భిణులకు అవసరం ఉన్నా లేకపోయినా సిజేరియన్ చికిత్సలకు వైద్యులు సిఫార్సు చేస్తూ పేద కుటుంబాలపై అనవసర ఆర్థికభారం మోపుతున్నారని, దీనిని నివారించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో నమోదైన గర్భిణులు, వారిలో జరుగుతున్న సాధారణ ప్రసవాలు, సిజేరియన్లు ఆయా నెలల్లో జరిగే అబార్షన్లకు సంబంధించిన సమాచారాన్ని సేకరించాలని స్పష్టం చేశారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు కూడా స్కానింగ్ సెంటర్స్‌ను తనిఖీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కె.రాణి, ఎన్‌సీడీ పీఓఓ డాక్టర్ సుబ్రమ్మణ్యం, డెమో వి.చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

హోటల్స్‌కు స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ రేటింగ్

• కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్

విజయనగరం అర్బన్: పర్యావరణ హితంగా పర్యాటకులను ఆకర్షించేలా నడిపే హోటళ్లకు ప్రభుత్వం గ్రీన్ లీఫ్ రేటింగ్ ఇస్తుందని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. అందుకోసం ఘన వ్యర్థాల నిర్వహణ, మానవ వ్యర్థాల నిర్వహణ, మురుగు నీటి నిర్వహణల ఆధారంగా మూడు విధాలుగా మార్కులను కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో హోటల్ యజమానులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో డివిజన్‌స్థాయిలో సబ్ కమిటీలు హోటల్స్‌ను తనిఖీ చేసి రేటింగ్ కోసం సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే ఈ రేటింగ్‌ను హోటళ్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవచ్చని అందువల్ల ఆయా హోటళ్ల ర్యాంకింగ్ బుక్ చేసుకునే వారికి తెలుస్తుందని పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకింగ్ ఉన్న హోటల్స్‌ను ప్రభుత్వమే వెబ్‌సైట్‌లో పెట్టి ప్రోత్సహిస్తుందని తెలిపారు. సమావేశంలో జిల్లా పర్యాటక అధికారి కుమారస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత, డీపీఓ వెంకటేశ్వరరావు, పలు హోటళ్ల యజమానులు, ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాసరావు, బాబూరావు కలెక్టర్‌ను పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

జేఎన్‌టీయూ జీవీలో జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం



విశిష్ట అతిథిని సత్కరిస్తున్న యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజేశ్వరి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ)లో రెండు రోజులు నిర్వహించే జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ఏక్తార్ ఎక్స్‌ఎక్స్‌వీ' అనే అంశంపై నిర్వహించిన ఈ సింపోజియంను యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా విశిష్ట అతిథిగా హాజరైన ఎన్ఎస్‌టీఎల్-జి రిటైర్డ్ శాస్త్రవేత్త పి.త్రిమూర్తులు మాట్లాడుతూ రోజువారీ జీవితంలో విజయానికి విద్య, వృత్తి నైపుణ్యాలు ముఖ్యమన్నారు. ఉన్నత ఉద్యోగాలకు, పదవుల ఇంటర్వ్యూలకు హాజరయ్యే విద్యార్థులు ప్రాథమిక సూత్రాలపై దృష్టి సారించడం ఎంతో అవసరమని సూచించారు. అనంతరం విశిష్ట అతిథిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జి.జయసుమ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, పూర్వ విద్యార్థుల సంబంధాల డైరెక్టర్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీజేనాగరాజు, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ వీఎస్ వకుళ, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్లు పి.శ్రీనివాసులురెడ్డి, టి.శిరీష, వివిధ కళాశాలల నుంచి హాజరైన 400 మంది వరకు విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని యువకుడి మృతి

శృంగవరపుకోట: పట్టణంలోని విశాఖ-అరుకు రోడ్డులో సోమవారం మధ్యాహ్నం పుణ్యగిరి కళాశాల వద్ద బైక్ ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానిక పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. బద్దు మహేందర్ అనే యువకుడు సోమవారం మధ్యాహ్నం 1.30 సమయంలో బైక్‌పై రోడ్డు దాటుతుండగా, విశాఖపట్నానికి చెందిన బసవబోయిన దుర్గాప్రసాద్(17) అనే యువకుడు తన మోటార్ సైకిల్‌పై కొత్తూరు నుంచి ఎస్.కోట వైపు వేగంగా వస్తూ మహేందర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయాల పాలవగా, తలకు గాయమైన దుర్గాప్రసాద్ స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుబజార్‌లో నేరుగా కూరగాయల విక్రయం

• రైతులకు పిలుపునిచ్చిన అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ అధికారి
• సాక్షి కథనానికి స్పందన

పార్వతీపురంటౌన్: రైతులు పండించే కూరగాయలను నేరుగా రైతుబజార్‌లో విక్రయించుకోవచ్చని అగ్రి ట్రేడ్-మార్కెటింగ్ అధికారి ఎల్.అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం సాక్షిలో 'రైతులు లేరు..జని రారు' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. రైతు బజార్‌లో రైతులు తమ కూరగాయలను రైతులు విక్రయించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం కూరగాయల పంట సీజన్ అయినందున, అధిక సంఖ్యలో దిగుబడి రావడం, తమ ప్రాంతాల్లో తగినంత గిట్టుబాటు ధర రాక ఇబ్బంది పడుతున్నట్లయితే మీ పల్లె లేదా మండలాల్లోని ఉద్యానవన శాఖ అధికారులు లేదా వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శులను కలిసి తగిన వివరాలు ఇస్తే, జిల్లాలోఉన్న అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ శాఖ ద్వారా మీ సరుకును పార్వతీపురంలోని రైతు బజార్‌లో నేరుగా అమ్ముకునే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల రైతుకు ఏ విధమైన నష్టం వాటిల్లదని, కావున రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర సందేహాల నివృత్తి కోసం ఫోన్ 91823 61348 నంబర్‌ను సంప్రదించవచ్చని ప్రకటనలో వివరించారు.

గ్యాస్ సిలిండర్ లీకై అగ్నిప్రమాదం

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి గ్రామానికి చెందిన బి.మల్లయ్య ఇంట్లో సోమవారం గ్యాస్ సిలిండర్ లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఇంట్లో అందరూ ఉండగానే గ్యాస్‌లీకై మంటలు రావడం గమనించి కుటుంబసభ్యులతో పాటు చుట్టుపక్కలకు చెందిన యువకులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు.ఈక్రమంలో బి.అప్పలరాజు అనే వ్యక్తి తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆ వ్యక్తిని కొత్తవలస ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. కాగా ఈ సమాచారం చెంతనే గల శారద మెటల్స్ అండ్ ఎల్లాయిస్ కార్మాగారం యాజమాన్యానికి అందించగా కర్మాగారానికి చెందిన ఫైర్ ఇంజిన్‌తో సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు.

పేదల ఇళ్ల కూల్చివేతకు ప్రయత్నం

• ప్రజలు ప్రతిఘటించడంతో వెనుదిరిగిన అధికారులు



జేసీబీతో తొలగిస్తున్న పూరిళ్లు



ఇళ్లు తొలగించ వద్దని ఆందోళన చేస్తున్న బాధితులు, వెంట నాయకులు

సాలూరు: రెక్కాడితే గాని డొక్కాడని పేద ప్రజలు నివాసముంటున్న ఇళ్లను కోర్టు ఆదేశాలతో కూలగొట్టేందుకు అధికారులు జేసీబీతో రాగా, తమ గూడును తొలగించవద్దంటూ పేదలు వాపోయి ఆందోళన చేసి ప్రతిఘటించారు. సాలూరు పట్టణంలో జరిగిన ఈ సంఘటన వివరాల్లోకి వెళ్తే మున్సిపాలిటీలోని 29వ వార్డులో ఉన్న రైల్వేస్టేషన్ రోడ్డులో పేదలు నివాసముంటున్న పూరిళ్లను కూల్చేందుకు మున్సిపల్ అధికారులు సోమవారం పూనుకున్నారు. కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న పేదల ఇళ్లను కూల్చేందుకు యత్నించారు. వెంటనే బాధిత ప్రజలు తమ ఇళ్లను కూల్చవద్దంటూ గగ్గోలు పెట్టారు. పట్టణ పౌరసంక్షేమ సంఘం కార్యదర్శి ఎన్వై నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు శ్రీనువాసరావు సదరు బాధిత పేదలకు అండగా నిలిచారు. పేదలతో కలిసి నాయకులు సంఘటనాస్థలానికి అధికారులు, పోలీసులతో తీసుకువచ్చిన జేసీబీని అడ్డుకున్నారు. నిరుపయోగంగా ఉన్న కొన్ని పూరిళ్లను తొలగించారు. ఈ సందర్భంగా పేదలు కమిషనర్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేసి 25 ఏళ్లుగా నివాసం ఉంటున్న చోటనే ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కూల్చివేత పనులు తాత్కాలికంగా నిలుపుదల చేయడంతో పేదలు ఊపిరిపీల్చుకున్నారు.

రైల్వేస్టేషన్లకు ఆధునిక హంగులు

• అమృత్ భారత్ పనులు పరిశీలించిన రైల్వే జీఎం



రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర ఫంక్వాల్



విజయనగరం స్టేషన్‌లో రైల్వే మేనేజర్ పరిశీలన

పార్వతీపురంటౌన్: ఆధునిక హంగులతో పార్వతీపురం రైల్వేస్టేషన్‌ను నిర్మిస్తున్నామని ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర ఫంక్వాల్ అన్నారు. ఈ మేరకు సోమవారం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అమృత్ భారత్ నూతన స్టేషన్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ప్రయాణికులకు కొద్ది రోజుల్లోనే అధునాతన రైల్వేస్టేషన్‌ను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అమృత్ భారత్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నూతనంగా ఎఫ్ఓబీ, టికెట్ కౌంటర్, రిజర్వేషన్ కౌంటర్, వెయిటింగ్ హాల్ పనులు జరుగుతున్నాయన్నారు. జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న స్టేషన్ ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. స్టేషన్ అభివృద్ధికి సిబ్బంది అంకిత భావంతో పని చేస్తున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విశాఖ డీఆర్ఎం మనోజ్ కుమార్ సాహూ, రాయగడ డీఆర్ఎం అమితాబ్ సింగల్, సీపీఓ అంకుస్ గుప్త, సీనియర్ డీసీఎం కె సాందీప్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల పర్యవేక్షణ

విజయనగరం టౌన్: ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ (భువనేశ్వర్) సోమవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. భువనేశ్వర్‌లో బయలుదేరిన ఆయన రాయగడ మీదుగా జిమిడిపేట, పార్వతీపురం, బొబ్బిలి, సీతానగరం మీదుగా రాత్రి 7 గంటల ప్రాంతంలో విజయనగరం రైల్వేస్టేషన్‌కు ప్రత్యేక రైల్లో చేరుకున్నారు. అడుగడుగునా ట్రాక్‌ల పరిశీలనతో పాటు మలుపులు, హెచ్చరికబోర్డులు, ట్రాక్ పాయింట్లు, ఆర్‌యూబీలు పర్యవేక్షించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు, రాజకీయనాయకులు, ప్రతినిధులు ఇచ్చిన వినతులను పరిశీలించారు. అమృత్‌భారత్ నిధుల్లో భాగంగా ప్రయాణికులకు ప్రత్యేక వసతుల కల్పనపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ మెడికల్ రూమ్‌ను ప్రారంభించారు. అమృత్‌భారత్ స్టేషన్ అభివృద్ధిపనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా చేపట్టాల్సిన పనులపై సూచనలు చేశారు.

జర్నలిస్టు సంఘాల నిరసన

• జర్నలిస్టుపై దాడిచేసిన టీడీపీ నాయకుడిని అరెస్టు చేయాలని డిమాండ్
• జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌కు వినతి



కలెక్టరేట్ ఆవరణలో ఆందోళన చేస్తున్న ఏపీడబ్ల్యూజే సంఘం నాయకులు



కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట నిరసనలో జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు

విజయనగరం అర్బన్: పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై దాడి చేసిన టీడీపీ మక్కువ మండల పార్టీ అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ నాయుడిని అరెస్టు చేయాలని జర్నలిస్టుల సంఘాలు డిమాండ్ చేశాయి. జర్నలిస్టుపై చేసిన దాడికి నిరసనగా స్థానిక కలెక్టరేట్ వద్ద గల గాంధీ విగ్రహం దగ్గర సోమవారం నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ విధినిర్వహణలో భాగంగా అభివృద్ధి పనుల నిర్వహణలపై వార్త కవరేజ్ కోసం విలేకరిపై దాడి చేయడం, చంపుతానని బెదిరించడం దుర్మార్గమని ఖండించారు. ఎన్నికల కోడ్ నిబంధనలను పాటించని అధికారుల పనులపై, మంత్రి కార్యక్రమాలపై ఎందుకు రాశావని అసభ్యకరమైన పదజాలంతో దూషించి భౌతిక దాడికి పాల్పడడం దారుణమని వాపోయారు. ఇకపై వార్తలు రాస్తే చంపేస్తానని బెదిరించిన వేణుగోపాల్ నాయుడిని కఠినంగా శిక్షించాలని, కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పీఎస్‌శివప్రసాద్, జిల్లా అధ్యక్షుడు అల్లు సూరిబాబు, ప్రధాన కార్యదర్శి ఎంఎస్ఎన్‌రాజు, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.రమేష్‌నాయుడు, జాప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవనాపు సత్యనారాయణ, తెలుగు జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు ఎంఎంఎల్‌నాయుడు, విజయనగరం వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు జి.కోటేశ్వరరావు, సాక్షి టీవీ బ్యూరో అల్లు యుగంధర్, ప్రజాశక్తి ప్రతినిధి సీహెచ్.రాము, వివిధ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు డేవిడ్ రాజు, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛకు విఘాతం

పార్వతీపురం: పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించడం వల్ల ప్రజాస్వామ్య మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని, వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించే విలేకరులపై దాడులు చేయడం సరికాదని ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అల్లువాడ కిశోర్ పేర్కొన్నారు. ఈ మేరకు మక్కువ మండల విలేకరిపై భౌతికదాడులకు పాల్పడడంతో పాటు చంపుతానని టీడీపీ మక్కువ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్‌నాయుడు హెచ్చరించిన చర్యను ఖండిస్తూ సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. దాడులకు నిరసనగా పలు నినాదాలు చేశారు. విలేకరిపై దాడి సంఘటన ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిదని పేర్కొన్నారు. తక్షణమే దాడి చేసిన వారిని చట్ట ప్రకారం శిక్షించాలని, విలేకరికి రక్షణ కల్పించాలని కోరుతూ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై విచారణ చేపట్టి అవసరమైన చర్యలు చేపడతామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే సంఘ సభ్యులు జిల్లా కార్యదర్శి గండి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరావు తోపాటు జిల్లాలోని వివిధ పత్రిలు, మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి

• డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ జీవన రాణి

విజయనగరం ఫోర్ట్: గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి తెలిపారు. ఈ మేరకు స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో 9 పీహెచ్‌సీల వైద్యాధికారులు సిబ్బందితో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులను త్వరితగతిన గుర్తించి వారు సుఖ ప్రసవం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బుధ, శనివారాల్లో నిర్వహించే వ్యాక్సినేషన్‌ను లబ్ధిదారులందరికీ వేసేలా చూడాలని చెప్పారు. టీబీ గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఒళ్లంతా తిమ్మిర్లుగా అనిపించడం, కండరాలు బలహీనంగా మారడం, డయేరియా, పొత్తి కడుపు నొప్పి, జ్వరంతో పాటు వాంతులు గులియన్ బారే సింగ్రోమ్ లక్షణాలని తెలిపారు. ఈ వ్యాధి పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నారు. నాడీ వ్యవస్థను ఈవైరస్ దెబ్బతీస్తుందని తెలిపారు. దీంతో రోగి పక్షవాతం బారిన పడతారన్నారు. ఇది అంత ప్రమాదకరం కాదని, దీని గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. డీఎల్ఓ డాక్టర్ కె.రాణి, డీఐఓ డాక్టర్ అచ్యుత కుమారి, ఎన్‌సీడీ పీఓ డాక్టర్ సుబ్రహ్మణ్యం, డెమో వి.చిన్నతల్లి, తదితరులు పాల్గొన్నారు.